## తెలంగాణ ప్రభుత్వము

# బడ్జెట్ ప్రసంగము

## 2016-17

ఈటల రాజేందర్

ఆర్థిక మంత్రి

**2016, మార్చి 14వ తేదిన తెలంగాణ రాష్ట్ర శాసనసభకు**
**2016-17 సంవత్సరం బడ్జెట్‌ను సమర్పిస్తూ గౌరవనీయులైన**
**ఆర్థిక మంత్రి శ్రీ ఈటల రాజేందర్ ప్రసంగం.**

***గౌరవనీయ అధ్యక్షా!***

తెలంగాణ రాష్ట్రంలో వరుసగా తొలి మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టే అవకాశం నాకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. నాపై ఈ బాధ్యత పెట్టి, నాకీ అవకాశం కల్పించిన గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి ధన్యవాదములు తెలుపుతూ 2016-17 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలను మీ ముందుంచుతున్నాను.

***అధ్యక్షా!***

2. తెలంగాణపై దశాబ్దాల పాటు కొనసాగిన వివక్ష, అన్యాయంపై అవిశ్రాంత పోరాటం చేసి సాధించుకున్న రాష్ట్రం మనది. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న ప్రజలు కొత్త అధ్యాయాన్ని లిఖించుకుంటున్న సందర్భమిది. ఈ రాష్ట్రంలో ప్రజలకు అనేక ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు ఉన్నాయి. అవసరాలు కూడా ఉన్నాయి. వాటన్నింటికి అనుగుణంగా బడ్జెట్ రూపొందించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రవేశపెట్టే మూడవ బడ్జెట్ అయినప్పటికి పూర్తి సమాచారంతో, సమగ్ర అధ్యయనంతో, వాస్తవాల ఆధారంగా రూపొందిన మొదటి బడ్జెట్ ఇదే. 2015-16 బడ్జెట్‌కు ప్రాతిపదిక 2014-15 ఆర్థిక సంవత్సరం లెక్కలు. 2014 ఏప్రిల్ నుండి 2015 మార్చి నాటికి వచ్చిన ఆదాయం, పెట్టిన ఖర్చు, సాధించిన ఫలితాలు తేలాలి. కానీ తెలంగాణ రాష్ట్రం 2014 జూన్‌లో ఏర్పడింది. పూర్తి స్థాయి లెక్కలు అందుబాటులో

లేవు. కేవలం అంచనాలు మాత్రమే ఉన్నాయి. కేంద్ర పథకాల ద్వారా వచ్చే నిధులు, కేంద్ర పన్నుల వాటా కొంత తగ్గాయి. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రాల ఋణ పరిమితి (ఎఫ్.ఆర్.బి.ఎమ్)ని వారి స్థూల ఉత్పత్తిలో మరో అర (0.5) శాతం పెంచినా అది ఇంకా అమలు కాలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014 ప్రకారం వెనుకబడిన ప్రాంత అభివృద్ధి కోసం కేంద్రం ఎంతో సహాయం చేస్తుందని ఆశించాము. కానీ కేవలం రూ.450 కోట్లు మాత్రమే ఇచ్చి మన ఆశలపై నీళ్లు చల్లింది. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు చేసిన తప్పిదాలకు మనం ఇప్పటికీ మూల్యం చెల్లించాల్సి వస్తున్నది. సామాజిక రంగం, వ్యవసాయం, సాగునీటి రంగం, మౌలిక సదుపాయాల కల్పన లాంటివి వారి హయంలో తీవ్రంగా నిర్లక్ష్యం చేయబడ్డాయి. ఉమ్మడి రాష్ట్రంలో బకాయి పడిన బిల్లులను మనం ఇప్పుడు చెల్లించాల్సి వస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో యథాలాపంగా ప్రారంభించిన 800లకు పైగా ప్రణాళికా పథకాలను అనివార్యంగా ఇప్పటికీ అమలు చేయాల్సి వస్తున్నది. వీటికి తోడు భారీ విద్యుత్ కొరత వంటి అనేక సమస్యలు రాష్ట్రాన్ని పీడించాయి.

3. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి గారు ప్రతీ శాఖ పనితీరును స్వయంగా సమీక్షించారు. ఆయా శాఖల్లో వచ్చే ఆదాయం ఎంత? ఖర్చవుతున్నది ఎంత? అందులో అమలవుతున్న పథకాలు ఏమిటి? అవి సాధిస్తున్న ఫలితాలు ఏమిటి? సరైన ఫలితాలు సాధించకపోవడానికి కారణాలు ఏమిటి? తదితర విషయాలను ముఖ్యమంత్రి గారు పూర్తి స్థాయిలో బేరీజు వేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇంత కూలంకశంగా సమీక్షించిన సందర్భం లేదు. ఈ సమీక్షలు, నిశిత అధ్యయనం అనంతరం ప్రవేశపెడుతున్న 2016-17

సంవత్సర బడ్జెట్ సమూల మార్పులకు నాంది పలుకుతున్నదని ప్రకటించడానికి సంతోషిస్తున్నాను.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

4. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు వచ్చిన మార్పును, రాష్ట్ర స్థూల ఆర్థిక స్థితిగతులను ఈ సభ దృష్టికి తెస్తున్నాను. గత రెండేళ్లలో వర్షపాతం సాధారణ వర్షపాతం కంటే తక్కువగా ఉన్నప్పటికీ రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా మెరుగుపడిందని తెలియజేసేందుకు గర్విస్తున్నాను. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలు 2014, 2015 సంవత్సరాలలో వరుసగా 30.2 శాతం, 14.3 శాతం తగ్గాయి. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలు మరింత తగ్గాయి. 2014, 2015 సంవత్సరాలలో అవి వరుసగా 58 శాతం, 79 శాతం తగ్గాయి. 2015-16లో మనరాష్ట్ర స్థూల ఉత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం 11.67 శాతం మెరుగైన వృద్ధి సాధించగలమని అంచనావేయడమైనది. వ్యవసాయము మరియు అనుబంధ రంగాలలో గత సంవత్సరంకంటే వృద్ధి తగ్గినప్పటికి ఈ 11.67 శాతం వృద్ధి సాధ్యపడింది. ఇది జాతీయ సగటు వృద్ధిరేటైన 8.6 శాతం కంటే చాలా ఎక్కువ. వచ్చే వర్షాకాలంలో సాధారణ వర్షపాతం ఉంటుందనే ఆశతో ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. వచ్చే ఏడాది రాష్ట్ర ఆర్థిక వృద్ధి కూడా మరింత మెరుగుపడుతుంది.

5. రాష్ట్ర తలసరి ఆదాయం ప్రస్తుత ధరల్లో 2014-15 సంవత్సరంలో 12.7 శాతం మెరుగయ్యి రూ.1,29,182 గా లెక్క తేలింది. 2015-16 సవంత్సరంలో తలసరి ఆదాయం 10.7 శాతం పెరిగి రూ.1,43,023 గా

ఉండవచ్చని అంచనా. ఇదే ఏడాది జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.93,231 కంటే మన రాష్ట్ర తలసరి ఆదాయం ఎక్కువగా ఉంది.

6. గతంలో తెలంగాణ ఆర్థిక స్థితి వాస్తవ సామర్థ్యం కంటే చాలా తక్కువగా ఉండేది. తెలంగాణలో మౌలిక సదుపాయాలను, సామాజిక రంగాలను ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. ఇక్కడ వనరులను అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల అభివృద్ధి కోసం తరలించేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ దుస్థితి నుంచి బయటపడ్డాం. నీళ్లు, నిధులు, నియామకాలు మన స్వాధీనంలోకి వచ్చాయి. మన ఆర్థిక వ్యవస్థ సంకెళ్లు తెంచుకుంది. గత రెండేళ్ళ వృద్ధి రేటును గమనిస్తే, భవిష్యత్తులో రాష్ట్రం వృద్ధి పరుగులు తీస్తుందనే భరోసా కలుగుతున్నది. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు, ఉత్పాదక రంగం, సేవల రంగాలు, అన్నింట్లో ఆర్థిక అభివృద్ధికి ఉజ్వలమైన అవకాశాలున్నాయి.

7. గౌరవ సభ్యులకు గుర్తుండే ఉంటుంది. కేసిఆర్ గారు ముఖ్యమంత్రిగా పదవి స్వీకరించిన తర్వాత ప్రజలను ఉద్దేశించి చేసిన మొదటి ప్రసంగంలో బంగారు తెలంగాణ సాదిద్దాం అన్నారు. ప్రజలు బాధల నుంచి విముక్తులయి ఆరోగ్యంగా, ఆనందంగా, సుసంపన్నంగా మారినప్పుడే బంగారు తెలంగాణ సాకారమవుతుంది. బంగారు తెలంగాణ అనేది కేవలం నినాదం కాదు. తెలంగాణ రాష్ట్ర అపారమైన శక్తి సామర్థ్యాలను ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా చేసే మహా సంకల్పం. బంగారు తెలంగాణ కల సాకారం చేసేందుకు అన్ని వనరులను, సామర్థ్యాలను రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి వినియోగిస్తున్నాం. ఉమ్మడి

రాష్ట్రంలో అణచివేతకు గురైన తెలంగాణ అస్తిత్వ, సాంస్కృతిక వైభవాలను పునరుద్ధరించేందుకు శ్రమిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేవలం 21 నెలల్లోనే బంగారు తెలంగాణ సాధనకు అవసరమైన మార్పులు చేపట్టినం. సంకెళ్ల నుంచి స్వేచ్ఛ దిశగా, బలహీనపాలన నుంచి ప్రజాపరిపాలన దిశగా పయనిస్తున్నాం. వాగ్ధానాలు చేయడం, పథకాలను రూపొందించడమే కాదు. ఆ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, ఫలితాలను ప్రజలకు చేర్చడం మా లక్ష్యం. వాగ్ధానాల అమలు దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నాం.

## ఆదాయ వనరులు – నిధుల వినియోగం

8. రాష్ట్రానికొచ్చే ఆదాయం, కేంద్రం ఇచ్చే గ్రాంటులు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాలతో పాటు స్థానికంగా ఉండే ఇతర ఆర్థిక వనరులపై కూడా ఇప్పుడు ఓ అవగాహన ఏర్పడింది. రాష్ట్రానికి పుష్కలమైన సహజవనరులు ఉన్నాయనడానికి TSIIC మచ్చుకు అమ్మిన కొన్ని భూములే ఉదాహరణ. ఎకరానికి 29 కోట్ల వరకు ధర పలికింది. వేల కోట్ల విలువ ఉన్న 380 ఎకరాల భూమి మీద ఉన్న కేసును సుప్రీం కోర్టులో ప్రభుత్వం గెలిచింది. దాదాపు 4 వేల కోట్ల వరకు వాణిజ్య పన్ను బకాయిలు వివిధ కేసుల్లో ఇరుక్కుని వున్నాయి. త్వరిత గతిన వీటి పరిష్కారానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొంటున్నది. ప్రజల మీద పన్ను భారం మోపకుండానే అభివృద్ధికి కావలసిన నిధులను సమీకరించడం ప్రభుత్వ వ్యూహం.

## అభివృద్ధి నిధుల కోసం నిరంతర నిరీక్షణ...... ఒకనాడు

9. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నిధుల కొరత ఉండదని, రాష్ట్రానికున్న ఆదాయ వనరులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయ వచ్చని మేము ఆనాడే చేప్పాం. దాని ప్రకారమే మేము ఎన్నికల మాని ఫెస్టో కూడా రూపొందించాం. అనుకున్నది అనుకున్నట్లే జరుగుతున్నది. మన వనరులు మన ప్రజల కోసం ఉపయోగించే అవకాశం వచ్చింది. మన కండ్ల ముందే వాస్తవాలు కనబడుతున్నాయి. ప్రణాళిక పద్దు కింద ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ తెలంగాణకు ఖర్చు పెట్టలెదు. అంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు బడ్జెట్ లెక్కలు తీసుకుంటే ఏ ఒక్క సంవత్సరం కూడా తెలంగాణ ప్రజల కోసం కనీసం పదివేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిన సందర్భం లేదు. అభివృద్ధి నిధుల కోసం తెలంగాణ ప్రజలు నిరంతరం నిరీక్షణ చేశారు. సమైక్య పాలనలో ప్రతీ రూపాయికి తెలంగాణ భిక్షమెత్తుకునే దుస్థితి ఉండేది. కానీ ఇప్పుడు చరిత్రను తిరగరాసుకుంటున్నాం. కేవలం ప్లాన్ బడ్జెట్ కింద గత ఆర్థిక సంవత్సరం రూ.52,383.20 కోట్లు కేటాయించుకోగలిగాం. ఈ సారి కూడా ప్లాన్ బడ్జెట్ కింద చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం డబ్బులు ఖర్చు పెట్టబోతున్నాం. తెలంగాణ రాష్ట్రం వస్తే ప్రజలకు ఏం ఒరుగుతుంది? అన్న వారికి ఇదే మా సమాధానం.

10. 2016-17 బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించే ముందుగా 2014 జూన్ లో ప్రభుత్వం ఏర్పడ్డనాటి నుండి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను, బంగారు తెలంగాణ సాధనకు ప్రభుత్వం చేసిన కృషిని వివరిస్తాను. బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆసరా పెన్షన్లను

గణనీయంగా పెంచాము. వందశాతం ప్రభుత్వ ఖర్చుతో పేదలకు రెండు బెడ్ రూంల ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నం. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తున్నం. తెల్లరేషన్ కార్డుదారులకు ఒక రూపాయికి కిలో బియ్యంను కుటుంబ సభ్యులందరికీ ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున ఇస్తున్నాం. విద్యార్థి వసతి గృహాలకు సన్నబియ్యం ఇస్తున్నాం. రైతుల కష్టాలు తీర్చేందుకు పంట రుణాల మాఫీ పథకాన్ని అమలు చేస్తున్నం. రాష్ట్రంలో ఉన్న 46000 చెరువులను పునరుద్ధ రించేందుకు మిషన్ కాకతీయ ప్రారంభించినం. రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు త్రాగు నీటిని సరఫరా చేయాలన్న సమున్నత లక్ష్యంతో మిషన్ భగీరథ అనే భారీ పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించినం. పరిపాలన పగ్గాలు చేపట్టిన నాడు విద్యుత్ లోటుతో కొట్టు మిట్టాడుతున్న రాష్ట్రంలో నేడు గృహావసరాలకు, పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్తును (కరెంటు) సరఫరా చేస్తున్నం. పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాన్ని ఆవిష్కరించినం. పారిశ్రామికీకరణను ప్రోత్స హించేందుకు టిఎస్-ఐ పాస్ అనే ఏక గవాక్ష అనుమతుల విధానాన్ని ప్రవే శపెట్టినం. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో స్టార్టప్ లకు, నవకల్పనలకు వేదికగా టి-హబ్ ని ప్రారంభించినం. అట్టడుగు వర్గాలకు న్యాయం చేయాలంటే వారికి రక్షణ, భద్రత కల్పించడంతో పాటు శాంతి భద్రతల వ్యవస్థను కాపాడటమూ ముఖ్యము. ప్రభుత్వం ఇందుకు అహర్నిషలూ కృషిచేస్తున్నది.

11. వచ్చే ఆర్థిక సంవత్సరానికి శాఖలవారీగా ప్రతిపాదించిన కేటాయింపులలో కొన్ని  ముఖ్యమైనవి ఈ సభకు సమర్పిస్తున్నాను.

## సాగు నీరు

12. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనే మేం చాలా సార్లు చెప్పాం. నదీ జలాల్లో మన వాటా ప్రకారం మనం నీళ్లు వాడుకోలేకపోతున్నామని బాధ పడ్డాం. గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణ వాటా 1250 టిఎంసిలు. మరో 150 టిఎంసిలకు పైగా మిగులు జలాల్లో తెలంగాణ వాటా ఉంది. కానీ ఈ నీటిని వాడుకోవడానికి కావాల్సిన ప్రాజెక్టులు కట్టలేదు. సమైక్య పాలనలో ప్రాజెక్టులన్నింటినీ అంతర్రాష్ట్ర వివాదాల్లోకి నెట్టేశారు. వివాదాల సాకు చూపి ప్రాజెక్టులను పక్కన పడేశారు. ఇది దురుద్దేశ్యంతో చేసిన కుట్ర. తెలంగాణ రాష్ట్రం వస్తే తప్ప గోదావరి, కృష్ణమ్మలు మన బీళ్లకు మళ్లవు అని పాటలు పాడుకున్నం. ఇప్పుడు జరుగుతున్నది అదే. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతే మన ముఖ్యమంత్రి కేసిఆర్ గారు ప్రాజెక్టుల రీ-డిజైనింగ్ చేపట్టారు. శాస్త్రీయంగా అధ్యయనం చేశారు. తెలంగాణలోని కోటి ఎకరాలకు సాగునీరు అందించడం కోసం సరైన ప్రణాళికలు వేశారు.

13. కర్ణాటక మరియు మహారాష్ట్ర ప్రభుత్వాలు అటు గోదావరి, ఇటు కృష్ణా, వాటి ఉప నదుల మీద దాదాపు 400 బ్యారేజిలు కట్టుకున్నది. ఫలితంగా అటు ఎస్.ఆర్.ఎస్పి.లో గానీ, ఇటు జూరాలలో గానీ చుక్కనీరు లేని పరిస్థితిని ఈ ఏడాది మనం కళ్లారా చూశాం. గోదావరి, కృష్ణా నదుల ద్వారా నీరు రావడం భవిష్యత్తులో కూడా గగనమే. ఇప్పుడు నీరు లభ్యమయ్యేది కేవలం ప్రాణహిత, ఇంద్రావతి నదుల ద్వారా మాత్రమే. అందుకే ఆ నీళ్లను ఒడిసిపట్టుకుని పంట పొలాలకు అందివ్వాలన్నదే ప్రాజెక్టుల రీ-డిజైన్ లక్ష్యం. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన వ్యాప్కోస్ (వాటర్

అండ్ పవర్ కన్సల్టాన్సీ సర్వీసెస్) ద్వారా కూలంకశ సర్వే నిర్వహించాం. లైడార్ సర్వేలు చేయించాం. అనుభవజ్ఞులైన ఇంజనీర్లతో, నిపుణులతో చర్చించాం. దాని ఆధారంగా సరైన ప్రణాళికతో ప్రాజెక్టులు కట్టాలని నిర్ణయించాం.

14. గోదావరి, ప్రాణహిత, పెన్ గంగ నదులపై నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టుల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తున్నది. గౌరవ ముఖ్యమంత్రి కేసిఆర్ గారు ఈ నెల 8న మహారాష్ట్రతో అంతరాష్ట్ర ప్రాజెక్టులపై చారిత్రక అవగాహన కుదుర్చుకుని వచ్చారు. రెండు రాష్ట్రాలలో ఉన్న ఉమ్మడి సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై వచ్చే సమస్యలను సామరస్యపూర్వకంగా, త్వరితగతిన పరిష్కరించుకొనేందుకు అంగీకారం కుదిరింది. అందుకోసం ఉమ్మడి అంతర్రాష్ట్రీయ బోర్డును ఏర్పాటు చేస్తున్నాము. ఈ అవగాహన ఫలితంగా గోదావరిపై మేడిగడ్డ, ప్రాణహితపై తుమ్మిడిహట్టి, పెన్ గంగపై రాజాపేట, చనాఖా-కొరటా, పిన్ పహాడ్ బ్యారేజిల నిర్మాణానికి మార్గం సుగమం అయింది. దక్షిణ తెలంగాణకు పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా, ఉత్తర తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లివ్వాలని నిర్ణయం తీసుకున్నాం. అటు ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా అదిలాబాద్ జిల్లాకు, శ్రీ సీతారామ ప్రాజెక్టు, భక్త రామదాసు ప్రాజెక్టుల ద్వారా ఖమ్మం జిల్లాకు సాగునీరు అందిస్తాం. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న భారీ, మధ్య తరహా నీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేస్తాము. భారీ, మధ్య తరహా నీటి ప్రాజెక్టులతో పాటు, చెరువుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకొంటున్నది. ఏడాదికి తొమ్మిది వేల చెరువుల చొప్పున గత ఏడాది మొదటి విడత మిషన్ కాకతీయ ప్రజల భాగస్వామ్యంతో ఓ ఉద్యమంలా

నడిచింది. రెండో విడత కూడా కొద్ది రోజుల్లోనే ప్రారంభం కానున్నది. తెలంగాణలోని కోటి ఎకరాలకు సాగునీరు అందివ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నది. ప్రాజెక్టుల నిర్మాణానికి, మిషన్ కాకతీయ పనుల కోసం బడ్జెట్‌లో ఏకంగా 25 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నాం. దేశ చరిత్రలో నభూతో అనే విధంగా ఇంత పెద్ద మొత్తంలో సాగునీటి కోసం ఖర్చు చేసిన సందర్భం మరోటి లేదు. దీన్ని బట్టి రైతులకు సాగునీరు అందివ్వడాన్ని ఈ ప్రభుత్వం ఎంత ప్రధానమైన కార్యక్రమంగా తీసుకున్నదో అర్థం చేసుకోవచ్చు.

15. సాగు నీటి రంగానికి ప్రతిపాదించిన రూ.25,000 కోట్లలో, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రూ.7861 కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.6286 కోట్లు, సీతారామ మరియు భక్తరామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1152 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

## మిషన్ భగీరథ – సృష్టికర్త – కే.సి.ఆర్.

16. ‘‘ప్రివెన్షన్ ఇజ్ బెటర్ దాన్ క్యూర్’’ అని నానుడి. త్రాగు నీటి ద్వారా వచ్చేవ్యాధుల నివారణ రక్షిత మంచినీటిద్వారానే సాధ్యం. ప్రజారోగ్యం మెరుగుపరచటానికి ఇదొక మంచి మార్గం. గౌరవ ముఖ్యమంత్రి సిద్ధిపేట శాసనసభ్యులుగా, ప్రతి ఊరికి, ప్రతి ఇంటికి నల్లా నీళ్ళు 20 సంవత్సరాల క్రితమే ఇచ్చారు. ఆ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలన్న ఆలోచనకు రూపమే మిషన్ భగీరథ. తెలంగాణా ఆడపడుచులు బిందె తలమీద పెట్టుకొని మైళ్ళ దూరం మంచినీటి కోసం పోరాదనే కల ఈ పథకానికి స్ఫూర్తి. గ్రామాల్లో అయితే 100

ఎల్.పి.సి.డి., పట్టణాలలో 135 ఎల్.పి.సి.డి. మరియు నగరాలలో 150 ఎల్.పి.సి.డి. చొప్పున ప్రజలకు మంచినీళ్ళు అందించడం ఈ పథక రచన. ఈ వినూత్న పథకం రూపకల్పన దశలోనే హడ్కో, నీతి అయోగ్ లాంటి సంస్థలు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహారు మరియు మధ్యప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రశంశలను అందుకొంది.

17. భగీరథ ప్రాజెక్టును 26 సెగ్మెంట్లుగా విభజించినాము. కృష్ణా, గోదావరి వంటి జీవనదులు, ప్రధాన రిజర్వాయర్ల నుండి 42.27 టి.ఎం.సి.ల నీటిని భగీరథ ప్రాజెక్టు ద్వారా తాగు నీటి అవసరాలకు పంపిణీ చేస్తాము. రూ.40,000 కోట్లతో నిర్మించే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రానున్న మూడేళ్లలో పూర్తవుతుంది. రూ.36,976.54 కోట్లు వ్యయంతో జరిగే పనులకు ఇప్పటికే పరిపాలనాపరంగా మంజూరిని ఇచ్చాము. 2016 చివరి నాటికి మిషన్ భగీరథ ద్వారా, 6,100 గ్రామాలకు, 12 పట్టణాలకు తాగునీరు అందుతుంది. 2017 డిసెంబరు నాటికి 95 శాతం గ్రామాలకు తాగునీరు అందించాలని కృషి చేస్తున్నాము. మిషన్ భగీరథ విజయానికి పంచాయతిరాజ్ శాఖ వారు అలుపెరుగక రేయింబవళ్ళు కృషి చేస్తున్నారు. వారిని ముందుండి నడిపిస్తున్న సహచర మంత్రి శ్రీ కె.తారక రామారావుకు హృదయపూర్వక అభినందనలు.

18. మిషన్ భగీరథ వ్యయానికి అవసరమైన నిధులను హడ్కో (HUDCO), నాబార్డు (NABARD), బ్యాంకు ఆఫ్ ఇండియా మరియు కెనరా బ్యాంకుల నుండి ఆర్థిక (ఋణ) సహాయంగా సమకూరుస్తున్నాం. ఆ సమున్నత లక్ష్యం కోసం బడ్జెటేతర ఆర్థిక వనరులను వినియోగించుకుంటున్నం. నిబద్ధతతో రానున్న మూడేళ్లలో మిషన్

భగీరథను పూర్తి చేస్తామని గౌరవనీయ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి తిరుగులేదు.

## విద్యుత్ రంగంలో తొలగిన చీకట్లు

19. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి తీవ్ర విద్యుత్ సంక్షోభం ఉంది. నిత్యం కరెంటు కోతలు, ఉక్కపోతలు, పరిశ్రమల మూతలు. కావాల్సినంత కరెంటు అందుబాటులో లేదు. విభజన చట్ట ప్రకారం విద్యుత్ ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుట్ర చేసింది. ఆ పరిస్థితి నుంచి తెలంగాణ రాష్ట్రం చాలా తొందరగా తేరుకుంది. తెలంగాణ రాష్ట్రం వస్తే మీకు చిమ్మ చీకట్లే మిగులుతాయి అని శాపాలు పెట్టిన వారి కళ్లు తెరిపించేలా కోతల్లేని విద్యుత్ అందిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదో నెల నుంచే రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఎత్తివేశాం. ఇక భవిష్యత్తులోనూ తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కోతలుండవు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 23,912 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభిస్తున్నది. కొత్తగా దిగువ జూరాల, పులిచింతల, హైడ్రో ప్రాజెక్టులు, భద్రాద్రి, కొత్తగూడెం, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులను చేపట్టినం. 6160 మెగా వాట్ల విద్యుత్తును ఇవి ఉత్పత్తి చేయగలుగుతాయి. తెలంగాణలోని పలు చోట్ల మొత్తం 6000 మెగా వాట్ల విద్యుత్ ఉత్పాదక సామర్ద్యం గల థర్మల్ ప్రాజెక్టులను నెలకొల్పేందుకు భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ తో ఒప్పందం కుదుర్చుకున్నం. 680 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తి అయి అందుబాటులోకి వచ్చాయి.

20. సంప్రదాయిక ఇంధన వనరులతో పాటు సాంప్రదాయేతర ఇంధన వనరులను కూడా విస్తారంగా వినియోగించుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన. తెలంగాణ రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పాదనకు ఉన్న అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నదే మా విధానం. సౌర విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పేవారికి మౌలిక సదుపాయాలను కల్పిస్తాము. నూతన విధానం ప్రకారం ఒక సెల్ ఏక గవాక్ష (సింగిల్ విండో) పద్ధతిన పనిచేస్తుంది. సౌరవిద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పాలనుకునే వారికి అన్ని అనుమతులు ఆ సెల్‌లో ఒకే చోట లభిస్తాయి. సోలార్ ప్లాంటు నెలకొల్పేందుకు కొనే భూమి పై చెల్లించిన స్టాంపు డ్యూటీని, ప్లాంటుకు అవసరమైన సాంకేతిక సామాగ్రి కొనుగోలుకు చెల్లించిన వ్యాటును నూటికి నూరు శాతం తిరిగి చెల్లిస్తాము. 2017-2018 నాటికి 5000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా పెట్టుకున్నాము.

21. ప్రభుత్వం తీసుకున్న చర్యలవల్ల భయంకరమైన కరెంటు కొరత ఉన్న తెలంగాణ రాష్ట్రం తక్కువ సమయంలోనే సమస్యను అధిగమించగలిగింది. రూ.91,500 కోట్ల పెట్టుబడితో జెన్‌కో, సింగరేణి కాలరీస్, ఎన్టీపిసీ, సోలార్ యూనిట్ల ద్వారా ఈ లక్ష్యం నెరవేర్చబోతున్నాం. వచ్చే ఖరీఫ్ నుంచి రైతులకు తొమ్మిది గంటల పాటు విద్యుత్ అందిస్తామని ప్రకటించటానికి సంతోషిస్తున్నాను.

## వ్యవసాయం, అనుబంధ రంగాలు

22. రాష్ట్రంలో ఎక్కువ మంది ఆధారపడే రంగం వ్యవసాయం. ఎక్కువ మంది బతికేది వ్యవసాయంతోనే. అందుకే వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది ప్రభుత్వం. 17 వేల కోట్ల రూపాయల పంట

రుణాలను మాఫీ చేసినం. ఋణ మాఫీకై చెల్లించాల్సిన వాయిదాలను నాలుగు విడతలకు గాను ఇప్పటికే రెండు విడతలు బ్యాంకుల్లో జమచేశాం. 2016-17లో మరో విడత అందిస్తున్నాం. వచ్చే ఏడాది అంటే 2017-18 సంవత్సరంలో రైతుల పంట రుణాలు వందకు వంద శాతం మాఫీ అవుతాయి. రాష్ట్రంలోని ప్రతి ఎకరా సాగు భూమికి సేద్యపు నీరు అందిచాలన్న లక్ష్యంతో 2016-17 బడ్జెట్‌లో ముందెన్నడూ లేని విధంగా రూ.25,000 వేల కోట్లను ప్రతిపాదించిన విషయం ఇంతక్రితమే చేప్పాను. సమయానికి తగినంత సాగునీరు అందడం వల్ల వ్యవసాయ ఆదాయం మెరుగుపడుతుంది. దీనికి తోడు వ్యవసాయ రంగంలో అనేక వినూత్న పథకాలను ప్రవేశపెట్టాము. రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా అభివృద్ధి చేస్తున్నాము. వరి, మొక్క జొన్న, పప్పుదినుసులు, నూనెగింజలకు ప్రత్యేక పంట క్షేత్రాలను ఏర్పాటు చేస్తాము. కోసిన పంటల నిలువకూ, మార్కెటింగుకూ తగిన సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నాము. పాలీ హౌజ్, గ్రీన్ హౌజ్ కల్టివేషన్ ను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు సబ్సిడీలు ఇస్తున్నాం. రాష్ట్రంలో 2016-17లో 600 మంది ఎస్సీ, ఎస్టీ రైతులకు పాలీహౌజ్ కల్టివేషన్ లో నూటికి నూరు శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించాం. రైతులందరికీ భూసార ఆరోగ్య కార్డులను పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించాము. ఈ కార్డు వల్ల రైతుకు తమ భూసార ఆరోగ్య స్థితి తెలుస్తుంది. దీని వల్ల తమ భూమికి తగిన రసాయనిక ఎరువులనే వాడడం ద్వారా ఉత్పాదకత పెంచగలుగుతాము.

23. సూక్ష్మ సేద్యం ప్రాధాన్యతను గుర్తించాము. సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించేందుకు, అన్ని సామాజిక వర్గాల రైతులకు సబ్సిడీ పరిమితిని

1 హెక్టారు నుంచి 5 హెక్టార్ల వరకు పెంచాము. అదేవిధంగా గరిష్ట సబ్సిడీపై వున్న కుటుంబానికి లక్ష రూపాయల పరిమితిని సడలించాము. వ్యవసాయ రంగంలో చక్కటి ఫలసాయాన్ని ఇచ్చే అంశాల్లో పండ్లు, కూర గాయల సాగు ముఖ్యమైనది. రాష్ట్రంలో కూరగాయల సాగుకు అను కూలమైన భూములు ఉన్నా మనకు అవసరమైన కూరగాయల్లో 70 శాతం దిగుమతి చేసుకుంటున్నాము. పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం హార్టికల్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దిగుబడుల సేకరణ, నిలువ, మార్కె టింగు వ్యవహారాల్లో ఈ కార్పొరేషన్ను రైతుకు బాసటగా నిలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పి పసుపు, కారం, అల్లం లాంటి సరుకులను కూడా నాణ్యమైనవి ప్రజలకు అందించాలని నిర్ణయించాం.

24. రైతుల వ్యవసాయ పరపతి అవసరాల పట్ల శ్రద్ధ పెడుతున్నాము. రైతులకు బ్యాంకులు, నాబార్డు ఇచ్చే వార్షిక వ్యవసాయ పరపతి రుణాల పరిమితిని పెంచేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటున్నది. కేంద్రం ప్రారంభించిన ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన రాష్ట్ర రైతాంగానికి ఎంతో తోడ్పాటును ఇస్తుంది. పంట భీమా కోసం రైతులు ఖరీఫ్ పంట లపై 2 శాతం, రబీ పంటలపై 1.5 శాతం ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. మిగతా ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రకృతి వైపరిత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు పంట భీమా చేసిన రైతులకు పూర్తి పరిహారం లభి స్తుంది.

25. మార్కెటింగు శాఖ వారు రాష్ట్రంలోని 330 చోట్ల గిడ్డంగుల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. 17.075 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇందులో నిలువ చేయవచ్చు. నాబార్డు (NABARD) ఋణ సహాయంతో చేయనున్న ఈ గిడ్డంగుల నిర్మాణపు అంచనా వ్యయం రూ. 1024.50 కోట్లు.

26. చెరువుల పునరుద్ధరణ వల్ల మత్స్యసంపద కూడా పెరుగుతుంది. మత్స్య పరిశ్రమను ప్రోత్సహించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. NCDC ఆర్థిక సహాయంతో మేకలు, గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాము. సంచార పశువైద్యశాలలను పటిష్టపరుస్తున్నాము.

27. 2016-17 బడ్జెట్ లో వ్యవసాయ శాఖ, సహకార శాఖ, మార్కెటింగు శాఖలకు రూ.6,759 కోట్లను ప్రతిపాదిస్తున్నాము.

## ఆరోగ్యం

28. మాది అభివృద్ధి అంటే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జి.ఎస్.డి.పి). పెరగడం మాత్రమే అనుకొనే యాంత్రిక అవగాహన కాదు. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత, అమర్త్యసేన్ ఒక సందర్భంలో మాట్లాడుతూ మనదేశం ఆర్థిక అభివృద్ధిలో రెండో స్థానంలో ఉంది. కానీ మానవ అభివృద్ధి సూచికల్లో 138వ స్థానంలో ఉందని అన్నారు. ఈ అంతరాన్ని కుదించడానికి విద్య మరియు ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించడమే ఏకైక మార్గం. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నది. అయితే ఆ ప్రజలు ఆరోగ్యంగా, క్షేమంగా ఉన్నప్పుడే పథకాలకు సార్థకత. అందుకే ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల

అత్యంత అప్రమత్తంగా ఉండాలని నిర్ణయించింది. ఇప్పుడున్న ప్రజా వైద్యంలో సంస్కరణలు రావలసిన అవసరం వుంది. ప్రజావైద్యం మెరుగుదలకు, స్థిరీకరణకు, క్రోడీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించాం. నేను రాను బిడ్డో సర్కారు దవఖానకు అనే పరిస్థితి పోయి, బీమారయితే సర్కారు దవాఖానాకే పోతాం అనే దశకు తీసుకొని వస్తాము.

29. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి నిమ్స్ వరకు ఏ ఆసుపత్రికి ఏమి చేయాలనే విషయంలో ప్రభుత్వం సమగ్ర అధ్యయనం జరిపింది. ప్రభుత్వ వైద్యశాలలను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచడానికి, ఆసుపత్రుల్లో పడకలు, విద్యుత్, టాయిలెట్లు, బెడ్ షీట్లు సరైన రీతిలో ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజారోగ్యం ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైంది. సర్కారు వైద్యాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారు. 2016-17 బడ్జెట్ లో ప్రజారోగ్య రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుడతాం. సర్కారు దవాఖానాల్లో సౌకర్యాలు మెరుగు పర్చాలని గౌరవ ముఖ్యమంత్రి సంకల్పించారు. సర్కారు దవాఖానాల్లో, సౌకర్యాలు మెరుగు చేస్తే అవి ప్రైవేటు దవాఖానాలకు దీటుగా ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా 40 చోట్ల డయాలసిస్ సెంటర్లు, 40 చోట్ల డయాగ్నస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, శస్త్ర చికిత్స సౌకర్యాలు కల్పించాలని, డాక్టర్లతో సహా అన్ని ఖాళీలు భర్తీ చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైద్య విధాన పరిషత్ పరిధిలోకి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు తీసుకొస్తాము.

30. సర్కారు దవాఖానాల ఆధునీకరణ కోసం, 2016-17 బడ్జెట్ లో ప్రజారోగ్య రంగానికి తగినన్ని నిధులు కేటాయిస్తం. వైద్య పరికరాల కొనుగోలు కోసం రూ. 600 కోట్లు, డయాగ్నొస్టిక్ వ్యాధి నిర్థారణ పరికరాల కొనుగోలు కోసం రూ.316 కోట్లు, పాత మంచాల స్థానంలో కొత్తవి వేసేందుకు, దవాఖాన భవనాల మరమ్మత్తులకూ వన్ టైమ్ ప్రావిజన్ గా ప్రజారోగ్య రంగానికి కేటాయింపులు చేసాము. మందులు, శస్త్రచికిత్స పరికరాల కొనుగోలుకు నిధులను పెంచుతున్నాం. అందుకోసం 2015-16 బడ్జెట్ లో రూ.117 కోట్లు ప్రతిపాదించినం. 2016-17 బడ్జెట్ లో మందులు, చికిత్స పరికరాల కోసం రూ.225 కోట్లను ప్రతిపాదిస్తున్నం. పై కేటాయింపులకు అదనంగా మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్లోని శాఖాదిపతులకు రు.56 కోట్లు కేటాయించాము. ఆకస్మికంగా ఏమైనా అవసరాలు వస్తే, తాత్సారం చేయక తగిన నిర్ణయాలు తీసుకొని ఈ నిధులను వినియెగిస్తారు. ఆకస్మిక అవసరాలకు ప్రభుత్వాన్ని నిధులు అడగడంలో జరిగే కాలయాపనను ఇది నివారిస్తుంది. ప్రజారోగ్య వ్యవస్థ పటిష్ఠతకు, డాక్టర్లపై పని భారాన్ని తగ్గించేందుకు సర్కారు దవాఖానాల సూపరింటెండెంట్లకు మరిన్ని అధికారాలు ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నాం.

31. హైదరాబాదు నగరంలో జనాభా ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. జనాభాకు తగినన్ని సర్కారు దవాఖానాలు నగరంలో లేవు. ఎప్పుడో వెలసిన దవాఖానాలే ఇప్పటికీ, ఇంత జనాభాకూ సేవలందిస్తున్నాయి. పెరిగిన ప్రజావసరాల దృష్ట్యా నగరంలో ఉస్మానియా, గాంధీ, కింగ్ కోఠికి తోడు మరో నాలుగు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మించాలని నిశ్చయించినాం. నెదర్లాండ్స్‌కు చెందిన రాబో బ్యాంకు వారి సహాయ సహకారాలతో వీటిని నెలకొల్పుతాం. వరంగల్ ఎంజిఎంను సూపర్ స్పెషాలిటీ

హాస్పిటల్‌గా మారుస్తాం. ఖమ్మం, కరీంనగర్ లో కూడా ఆధునికి సౌకర్యాలతో కొత్త దవాఖానాల నిర్మాణానికి ఇదే సంస్థను సంప్రదించినం. రాబో బ్యాంకు ఆర్థిక సహకారంతో శ్రీలంక దేశంలో దవాఖానాలు నెలకొల్పారు. ఆరోగ్యశాఖ మంత్రి గారి నాయకత్వంలోని అధికారుల బృందం ఇటీవలే శ్రీలంకను సందర్శించి, ఆ దవాఖానాలు చూసి వచ్చారు. తమిళనాడుకు కూడా వెళ్లి అక్కడి ప్రజారోగ్యం గురించి అధ్యయనం చేశారు. ఎక్కడ మెరుగైన వైద్య సేవలందుతున్నా వాటిని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయడానికి మాకు ఎలాంటి శషభిషలు లేవు.

32. 2016-17 బడ్జెట్ లో ఆరోగ్య రంగానికి మొత్తం రూ.5,967 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. 2015-16 బడ్జెట్ లో చేసిన రూ.4,932 కోట్ల కంటే ఇది చాలా ఎక్కువ.

## విద్య – భవిష్యత్తుకు పునాది

33. మానవ వనరుల అభివృద్ధి ద్వారానే మంచి సమాజాన్ని నిర్మించగల మనేది ప్రభుత్వ ఉద్దేశం. పేద విద్యార్థుల చదువు కోసం పెట్టిన ఖర్చు భావితరాలను బాగు చేయడానికి ఉపయోగపడుతుంది. మానవ వనరుల అభివృద్ధికి దోహదపడుతుంది. ఆర్థిక స్థోమత కలిగిన వారి పిల్లలు ఎలాగూ మంచి పాఠశాలలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీ, ఇతర పేద వర్గాల పిల్లలకు పుస్తకాలు, బట్టలు, మంచిభోజనం సమకూర్చి నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయలకు పైగా విద్య కోసం ఖర్చుపెడుతున్నప్పటికీ, ప్రభుత్వ విద్యలో అనుకున్న ఫలితాలు రావడం లేదు. ప్రస్తుతమున్న అన్ని విద్యా సంస్థలు మెరగైన పద్ధతుల్లో నడిచేవిధంగా,

విద్యార్థులకు మంచి విద్య అందే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. మెడికల్, అగ్రికల్చర్, ఫార్మా మినహా మిగతా అన్ని రకాల, అన్ని స్థాయిల విద్యాసంస్థల నిర్వహణ బాధ్యత విద్యాశాఖకే అప్పగించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు గారు నిర్ణయించారు. మొత్తంగా విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ఉంది. ఎస్సీ, ఎస్టీ, బిసి, సంక్షేమ శాఖ ద్వారా నడుస్తున్న హాస్టళ్లను దశల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలుగా మారుస్తాం. బడి ఆవరణలో పరిశుభ్రతను నిర్వహిస్తూ, కనీస, సౌకర్యాలు కల్పించే బాధ్యతను గ్రామ పంచాయితీలకు అప్పగించాలని నిర్ణయించాం.

34. విద్యా శాఖ ప్రణాళికా వ్యయం కింద రూ.1,694 కోట్లు, ప్రణాళికేతర వ్యయం కింద రూ.9,044 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. పాఠశాల విద్య, ఉన్నత విద్య, సాంకేతిక విద్యలకు సంబందించిన వ్యయం మాత్రమే ఇది. మెడికల్, అగ్రికల్చరల్, వెటర్నరీ విద్య, మైనారిటీల విద్యకు మరియు ఉపకార వేతనాలకు, ఎస్.సి., ఎస్.టి. గురుకులాలకు, వసతి గృహాలకు ప్రభుత్వం చేస్తున్న వ్యయం విద్యమీదే అయినా విద్యా శాఖ డిమాండ్లలో భాగం కాదని గమనించాలని కోరుతున్నాను.

## సంక్షేమ పథకాలు

35. ఇది సంక్షేమానికి పెద్ద పీటవేసే ప్రభుత్వమని, ఇది అట్టడుగు వర్గాలకు అసహాయకులకు, అన్నార్తులకు, అండగా నిలిచే ప్రభుత్వమని, స్వార్థం, దోపిడీ, సంకుచిత తత్వాలను

దరిచేరనీయకుండా ధృఢ సంకల్పంతో నిజమైన అభివృద్ధిని సాధించే ప్రభుత్వమని ప్రజలలో విశ్వాసాన్ని కలిగించాం.

## రెండు బెడ్ రూమ్ ల ఇండ్లు (రెండు పడక గదుల ఇళ్ళు)

36. నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి గారు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిన సంగతి మీకు తెలుసు. రెండు పడక గదులు, హాలు, వంటగది, రెండు మరుగుదొడ్లు ఉన్న రెండు బెడ్ రూంల ఇంటిని ఈ పథకం కింద నిర్మిస్తాం. దేశంలో మరెక్కడా కూడా నిరుపేదలకు వందశాతం ప్రభుత్వ ఖర్చుతో ఇంత పెద్ద ఇల్లు కట్టడం లేదు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం అమలు కావడం మనందరికీ గర్వకారణం. అర్హులైన పేద లకు దశల వారీగా ఇండ్లు కట్టించి ఇస్తాము. ప్రభుత్వ విధాన నిర్ణయానికి అనుగుణంగా, గత ఏడాది 60,000 డబుల్ బెడ్ రూం ఇండ్లను మంజూరు చేశాము. ఇందులో 36,000 ఇండ్లు గ్రామాల్లో 24,000 ఇండ్లు పట్టణ ప్రాంతాల్లో నిర్మించాలన్నది లక్ష్యం. కేంద్ర ప్రభుత్వ మార్గద ర్శకాలు అప్పటికింకా ఖరారు కానప్పటికి చొరవ తీసుకొని ఒక నిర్ణయానికి వచ్చాము. సికింద్రాబాద్ ఐడిహెచ్ కాలనీలో 377 డబుల్ బెడ్ రూము ఇండ్లను నిర్మించి గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కూడా చేశాము. ఈ పథకం ప్రజల మన్ననలు అందుకుంది. దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నది. ఇండ్ల కోసం అసంఖ్యాక దరఖాస్తులు వస్తు న్నాయి. ఈ ఆదరణ, డిమాండ్లను చూసి ప్రభుత్వం తెగువతో ఒక నిర్ణయం తీసుకుంది. 2016-17 సంవత్సరంలో జిహెచ్ఎంసి పరిధిలో ఒక లక్ష ఇండ్లు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో మరో లక్ష ఇండ్లు నిర్మించా

లని భావిస్తున్నాము. 2016-17 లో నిర్మించదలచిన ఈ రెండు లక్షల ఇండ్ల వ్యయాన్ని హడ్కో నుండి ఇతర ఆర్థిక సంస్థల నుండి ఋణంగా తీసుకుంటాము. ఇది బడ్జెట్‌లో పేర్కొన్న వనరులకు అదనం. ఎటువంటి రాజకీయ అధికారిక ఒత్తిడులకు తలగ్గొకుండా, లబ్దిదారులను నిస్పక్షపాతంగా ఎంపిక చేస్తాము.

## షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమం

37. భారతదేశంలో బడ్జెట్ లోటు లేని రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి కావడం చాలా సంతోషకరం. గత ఏడాది లక్షా 15 వేల కోట్ల బడ్జెట్ పెట్టుకున్నాం. ఈ సారి అంతకంటే ఎక్కువ బడ్జెట్ పెట్టుకుంటున్నాం. మన వృద్ధి రేటు కూడా ఆశాజనకంగా ఉంది. అయితే ఈ అభివృద్ధి ఫలాలు పేదలకు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. పేదల సంక్షేమానికి, వారి విద్య కోసం, వారి వైద్యం కోసం పెట్టే ఖర్చును మానవ వనరుల అభివృద్ధి కోసం పెడుతున్న ఖర్చుగా ఈ ప్రభుత్వం భావిస్తున్నది. మానవ వనరుల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టకుండా సాధించే ప్రగతి అస్థిరమైనదని ఈ ప్రభుత్వం గట్టిగా నమ్ముతున్నది. అందుకే పేదల సంక్షేమానికి ఈ ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నది. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, మహిళా సంక్షేమం కోసం ఎక్కువ నిధులు ఖర్చు చేస్తున్నది. ప్రతి వ్యక్తిపై, సంక్షేమ రంగానికి ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్న రాష్ట్రం దేశంలో మరొకటి లేదు. సంక్షేమ రంగంలో దేశంలో నెంబర్ వన్ రాష్ట్రం తెలంగాణ అని ప్రకటించడానికి నేను గర్వపడుతున్నాను. కేవలం సంక్షేమ రంగానికి 2016-17 బడ్జెట్లో రూ.13,412 కోట్లు ఖర్చు పెడుతున్నామని సగర్వంగా ప్రకటిస్తున్నాను.

దేశంలో మరే రాష్ట్రం కూడా సంక్షేమానికి ఇంత పెద్దమొత్తంలో తలసరి ఖర్చు పెట్టడంలేదు. అంతే కాదు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అల్పాదాయ వర్గాలుగా పరిగణించడానికి గతంలో ఉన్న ఆదాయ పరిమితిని కూడా పెంచినాము. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పరిమితిని రూ.60 వేల నుండి రూ.లక్షన్నర వరకు, పట్టణ ప్రాంతాల్లో పరిమితిని రూ.75 వేల నుంచి 2 లక్షల వరకు పెంచాము. దీని వల్ల ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అంగన్ వాడీ వర్కర్లు, హోంగార్డులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులకు కూడా అందుతున్నాయి.

## ఎస్సీ సంక్షేమం

38. సామాజిక ఆర్థిక రంగాల్లో తరతరలుగా నిర్లక్ష్యానికి గురైన షెడ్యూల్డు కులాల వారి వికాసానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. వీరి సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నాము. ఆర్థికాభివృద్ధి పథకాలు, వ్యవసాయ భూమి కొనుగోలు పథకం, ఎస్సీ యువతకు నైపుణ్య శిక్షణ, కళ్యాణ లక్ష్మి, విదేశాలలో చదువులకు ఆర్థిక సహాయం, ఎస్సీ నివాస గృహాలకు ఉచిత కరెంటు (50 యూనిట్లవరకు) వంటి పథకాల అమలుతో వీరి వికాసానికి కృషి చేస్తున్నాము. డబుల్ బెడ్ రూం గృహాల పథకంలో ఎస్సీ లబ్దిదారులను గణనీయంగా ఎంపిక చేసేందుకు శ్రద్ధ తీసుకుంటున్నాము. షెడ్యూల్డు కులాల సంక్షేమానికి 2016-17 బడ్జెట్లో రూ.7,122 కోట్లను ప్రతిపాదిస్తున్నాను.

## ఎస్టీ సంక్షేమం

39. సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మాత్రమే గిరిజనుల అభ్యున్నతి సాకారం అవుతుంది. ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అదే. షెడ్యూల్డు తెగల స్థితి గతులపై ఒక విచారణ కమీషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. కమీషన్ నివేదిక వచ్చాక, వారి సిఫారసుల మేరకు షెడ్యూల్డు తెగల సామాజిక ఆర్థిక వికాసానికి తగిన చర్యలను తీసుకుంటాము. కమీషన్ ఇచ్చే సూచనలను అనుసరించి వాల్మీకి బోయ, కాయితీ లంబాడా తెగలను షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చే అవకాశాలను పరిశీలిస్తాము. గిరిజన సంక్షేమం కోసం 2016-17 బడ్జెట్‌లో రూ.3,752 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

## బీసి సంక్షేమం

40. రాష్ట్రంలో జనాభా పరంగా వెనుకబడిన తరగతుల వారే అధికులు. బీసిలలో వృత్తికారుల సంక్షేమ వికాసాలను ఆశించి ఫైనాన్సు కార్పోరేషన్లు పనిచేస్తున్నాయి. ఆయా వృత్తులకు చెందిన సామాజిక వర్గాల వారి ఆర్థిక అవసరాలను తీర్చేందుకు ఇవి కృషి చేస్తున్నాయి. ఆ కార్పోరేషన్లకు తగినన్ని నిధులను కేటాయించాము. విద్యార్థులకు కళాశాలల ట్యూషన్ ఫీజులను రీ-ఎంబర్స్ చేయటమే కాక, వారికి రాష్ట్రంలో పది బీసి స్టడీ సర్కిల్లలో ఉచిత శిక్షణ ఇస్తున్నాము. ఆదిలాబాదు, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఖమ్మం జిల్లాలో బీసి స్టడీ సర్కిళ్ల నిర్మాణం కోసం భూమిని కేటాయించాము. వెనుక బడిన తరగతుల సంక్షేమం కోసం 2016-17 బడ్జెట్‌లో రూ.2,538 కోట్లను ప్రతిపాదిస్తున్నాము.

## మైనారిటీ సంక్షేమం

41. మైనారిటీ సంక్షేమం మా ప్రభుత్వానికి అత్యంత ప్రధానం, రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుండి ఇప్పటి వరకు మైనారిటీల సంక్షేమం కోసం మా ప్రభుత్వం తీసుకున్న చర్యలే అందుకు సాక్ష్యం. షాదీ ముబారక్ కోసం గత ఏడాది, రూ.100 కోట్లు కేటాయించాము. కేటాయించిన నిధులు సద్వినియోగం అయ్యాయి కాబట్టి మరో రూ.50 కోట్లు అదనంగా కేటాయించామని ఈ సభకు సగర్వంగా తెలియజేస్తున్నాను. మైనారిటీ విద్యార్థుల విదేశీ చదువుల కోసం స్కాలర్ షిప్పులు ఇచ్చేందుకు రూ.25 కోట్లు విడుదల చేశాము. సివిల్ సర్వీసెస్ పరీక్షలు, రాష్ట్ర ఉద్యోగ పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు కోచింగ్ ఇవ్వడానికి 2015 సెప్టెంబర్‌లో మైనారిటీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేశాము. మైనారిటీల స్థితిగతులు అధ్యయనం చేయడానికి సుధీర్ కమిటీని ప్రభుత్వం నియమించింది. కమిటీ నివేదిక వచ్చిన వెంటనే మైనారిటీల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి శాశ్వత ప్రాతిపదికన ఏ చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తాము.

42. సమాజ వికాసానికి చదువే ముఖ్యము. కాబట్టి మైనారిటీల కోసం 70 ఇంగ్లీషు మీడియం ఆశ్రమ పాఠశాలలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 2016-17 నుండే ఈ స్కూళ్లు ప్రారంభం అవుతాయి. ఈ బడ్జెట్‌లో కొత్త ఆశ్రమ పాఠశాలలకు రూ.350 కోట్లు ప్రతిపాదిస్తున్నాము. 2016-17 బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమానికి మొత్తం రూ.1,204 కోట్లను ప్రతిపాదిస్తున్నాము.

## ఆసరా ఫించన్లు

43. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఆసరా ఫించన్ల వల్ల వృద్ధులు, వికలాంగులు, వితంతువుల జీవితాలకు భద్రత చేకూరింది. గౌరవంగా జీవించేందుకు ఇది ఆలంబన అయింది. నేత కార్మికులు, గీత కార్మికులు, బీడి కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు కూడా ఆసరా ఫించన్లు ఇచ్చి భరోసా కల్పించాము. ఈ ఆసరా ఫించన్ల పథకం కింద 35.74 లక్షల మందికి భద్రత ఏర్పడింది. 2016-17 బడ్జెట్‌లో ఆసరా ఫించన్ల కోసం రూ.4,693 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

## కళ్యాణలక్ష్మి

44. పేదింటి ఆడపిల్ల పెండ్లి కన్నతల్లిదండ్రులకు ఎంత భారమో మనందరికీ తెలుసు. ఆ భారాన్ని కొంత మేరకైనా పంచుకోవాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. కళ్యాణలక్ష్మి పథకం ప్రారంభమయ్యాక పేదింట్లో పెళ్లి ఎంతో సంతోషంగా జరుగుతున్నది. ఎస్సీ, ఎస్టీ, ముస్లింల అమ్మాయిల పెళ్లికి యాభై ఒక్కవేల రూపాయలు (రూ.51,000) ఇస్తూ రెండేళ్ల క్రితం ఈ పథకాన్ని ప్రారంభించాము. ఈ ఏడాది నుంచి (2016-17) బిసిలతో సహా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలన్నింటికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని సగర్వంగా ప్రకటిస్తున్నాను. కాబట్టి 2016-17 బడ్జెట్‌లో కళ్యాణలక్ష్మి పథకం కోసం రూ.738 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

## మహిళా, శిశు సంక్షేమం

45. గౌరవ సభ్యులకు తెలుసు. 2014-15 మరియు 2015-16 బడ్జెట్లలో మహిళా, శిశు సంక్షేమం కోసం వివిధ పథకాలను ప్రారంభించాము. ఆరోగ్య లక్ష్మి కార్యక్రమం ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులకు ఇచ్చే గుడ్ల సంఖ్యను, పాలను పెంచాము. అంగన్‌వాడి వర్కర్లకు ఇచ్చే వేతనాలను పెంచాము. వారికి అందించే సేవలలో నాణ్యత పెంపొందించేందుకు విశేషంగా కృషి చేస్తున్నాము. 2016-17 బడ్జెట్‌లో మహిళా, శిశు సంక్షేమం కోసం రూ.1,553 కోట్లను ప్రతిపాదిస్తున్నాము.

## బ్రాహ్మణ సంక్షేమం

46. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాల వారి సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. సమాజంలో ఇతర వర్గాల లాగానే, బ్రాహ్మణ సామాజిక వర్గంలో పేదలున్నారని ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే గౌరవ ముఖ్యమంత్రి వర్యులు బ్రాహ్మణ సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తూ అందుకోసం రూ.100 కోట్లు 2016-17 బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. బ్రాహ్మణ సంక్షేమ నిధి విధి విధానాలను త్వరలోనే ఖరారు చేస్తాము.

## రోడ్లు, భవనాలు

47. గౌరవ సభ్యులకు తెలుసు అన్ని మండలాలను ఆ జిల్లా హెడ్ క్వార్టర్‌తో అనుసంధానిస్తూ డబుల్ లేన్‌రోడ్లను, అన్ని జిల్లాలను రాష్ట్ర

రాజధానితో కలుపుతూ నాలుగు లైన్ల రోడ్లను వేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రోడ్ల పనులు దశలవారీగా చేపడుతున్నాం. ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో 2570 కిలోమీటర్ల మేర కొత్త రహదారులు నిర్మిస్తున్నాం. 4 వేల కిలోమీటర్ల మేర రహదారులను బాగు చేస్తున్నాం. ఆరు దశాబ్దాల సమైక్య పాలనలో తెలంగాణ ప్రాంతంలో నిర్మించిన జాతీయ రహదారులు కేవలం 2600 కిలోమీటర్లు మాత్రమే. జాతీయ రహదారుల నిర్మాణంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి కేసిఆర్ గారు పలుమార్లు ప్రధాన మంత్రి దృష్టికి, కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం పోరాడారు. దాని ఫలితంగా ఈ ఒక్క ఏడాదే తెలంగాణ రాష్ట్రానికి 1600 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే కార్యాలయాలు, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, అధికారులకు నివాస గృహాలు, రాజ్ భవన్ వద్ద అదనపు భవనాలు, తెలంగాణ కళాభారతిలను నిర్మించదల్చినం. 2016-17 బడ్జెట్‌లో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.3333 కోట్లు, భవనాల నిర్మాణానికి రూ.457 కోట్లను ప్రతిపాదిస్తున్నాము.

## పోలీసు, ప్రజా భద్రత రక్షణ

48. భద్రతకు భరోసా వుందన్న నమ్మకం వుంటే పరిశ్రమలు, సేవా రంగాలలో దేశ విదేశీ పెట్టుబడులు, పర్యాటకుల రాకడ ఎక్కువగా ఉంటుంది. అందుకే పోలీసు శాఖలో మౌళిక సదుపాయాలు, ఆధునికీకరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధన్యతను ఇస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ మొదటి రెండేళ్లలోనే ఆ శాఖకు 4000 ఆధునిక

వాహనాలను మంజూరు చేసినం. నాలుగు బెటాలియన్లకు గాను 3896 పోస్టులు మంజూరు చేసినం. ఈ శాఖకు కొత్తగా సీసీ టీవీలను మంజూరు చేస్తున్నం. ముఖ్యమైన ప్రదేశాల్లో, రహదారి కూడళ్లలో వీటిని ఏర్పాటు చేస్తాం. నగర సిసి టీవిల పర్యవేక్షణ కోసం 2016-17 బడ్జెట్‌లో రూ.225 కోట్లు ప్రతిపాదిస్తున్నాం. సందర్శకులకు కావాల్సిన కనీస సౌకర్యాలతో పోలీసు స్టేషన్లలోని రిసెప్షన్ సెంటర్‌లను ఆధునీకరిస్తున్నం. ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్నందు వల్ల కాలుష్యానికి వారి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రహించి ట్రాఫిక్ పోలీసుల సమస్యలపై స్పందించినం. ట్రాఫిక్ పోలీసులకు బేసిక్ వేతనానికి 30 శాతం అదనపు భత్యం కల్పించిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమే. సి.ఐ.డి., ఇంటెలిజెన్సు శాఖల్లో పని చేసే వారికి బేసిక్‌పై 25 శాతం అదనపు భత్యాన్ని ఇచ్చినం. హోంగార్డుల జీతం ఇదివరకు రూ.9,000 ఉండేది, దానిని ఇప్పుడు రూ.12,000 పెంచినం. దేశంలోనే ఇది అత్యధికం.

49. సిటీ పోలీసు హెడ్ క్వార్టర్స్ నిర్మాణానికి బంజారాహిల్స్ లో 7 ఎకరాల స్థలాన్ని కేటాయించినం. ఇక్కడ పోలిస్ ట్విన్ టవర్స్ నిర్మిస్తాం. అత్యాధునిక కమాండ్, కంట్రోల్ సెంటర్ నిర్మిస్తున్నాం. 2016-17 బడ్జెట్‌లో దీని నిర్మాణం కోసం రూ.140 కోట్లు, పోలీసు సిబ్బంది క్వార్టర్ల నిర్మాణానికి, రూ.70 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

50. ఆకస్మిక సంఘటనలు జరిగినప్పుడు తక్షణమే చర్యలు తీసుకునే వెసులుబాటును కల్పిస్తూ జిల్లా పోలీసు సూపరింటెండెంటు, నగర పోలీసు కమిషనరుల ఒక్కొక్కరి వద్ద రూ.1 కోటి ఉంచాలని ప్రతిపాదిస్తున్నం. దీనికితోడు రూ.10 కోట్లు పోలీసు డైరెక్టరు జనరల్

ఆధీనంలో ఉంటుంది. 2016-17 బడ్జెట్‌లో ఆకస్మిక పరిస్థితుల నిర్వహణ కోసం రూ.20 కోట్లు ప్రతిపాదిస్తున్నం.

51. పోలీసు శాఖ పటిష్టతతో పాటు ఫైరు సర్వీసుల శాఖను కూడా పటిష్టం చేయనున్నం 22 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇప్పటికీ ఫైరుస్టేషన్లు లేవు. అగ్ని ప్రమాదాల నివారణ ఆవశ్యకతను గుర్తించి రాష్ట్రంలో కొత్తగా 63 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు కోసం 2016-17 బడ్జెట్‌లో రూ.64 కోట్లు ప్రతిపాదిస్తున్నాం. బహుళ అంతస్తుల బిల్డింగులలో అగ్ని ప్రమాదాలు జరిగితే రక్షణ చర్యలు చేపట్టేందుకు తగిన అత్యాధునిక అగ్ని మాపక వాహనాలు మూడింటిని ఆ శాఖకు సమకూరుస్తున్నం. 2016-17 బడ్జెట్‌లో అగ్నిమాపక శాఖకు రూ.223 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

## పంచాయతిరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి

52. గ్రామ పంచాయతీలను పటిష్టం చేసేందుకు 2015 ఆగస్టులో గ్రామ జ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించినం. మన ఊరు-మన ప్రణాళిక లో ప్రజల నుండి వచ్చిన సూచనల ప్రకారం గ్రామాభివృద్ధి ప్రణాళిక ను తయారు చేయడమే గ్రామ జ్యోతిలో ముఖ్యం. గ్రామాలలో కంకర రోడ్లను డాంబరు రోడ్లుగా మారుస్తూ, దెబ్బతిన్న రోడ్లపై డాంబరు రోడ్లు వేయడంతో బాటు ఆ రోడ్ల నిర్వహణ పనులను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ చేపట్టింది. సర్పంచ్‌లు, ఎం.పి.టి.సీలు, ఎం.పి.పి.లు, జెడ్.పి.టి.సి.లు మరియు జెడ్.పి. చైర్మన్ల గౌరవ వేతనం పెంచటంతోపాటు ప్రభుత్వమే ఆ వేతనాలను అందచేస్తున్నది. 2016-17లో రోడ్ల అభివృద్ధి, నిర్వహణ పనులకు పంచాయతీ రాజ్,

గ్రామీణాభివృద్ధి శాఖకు గ్రామీణ ఉపాధి హామీ పథకంతో కలిపి 2016-17 బడ్జెట్‌లో మొత్తం రూ.10,731 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

## పట్టణాభివృద్ధి

53. తెలంగాణ రాష్ట్రంలో పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతున్నది. జనాభాలో దాదాపు 40 శాతం మంది పట్టణాల్లోనే నివసిస్తున్నారు. భవిష్యత్తులో ఇది ఇంకా పెరిగే అవకాశం ఉన్నది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పౌర సదుపాయాల కల్పన జరగలేదు. దానివల్ల పలు పట్టణాల్లో కనీస ప్రాథమిక సదుపాయాలు కూడా లేవు. ఇకనైన మౌళిక వసతులు కల్పించకపోతే పట్టణ ప్రజలకు అవి నివాస యోగ్యాలు కావు. ఈ వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని ఖమ్మం, రామగుండం, కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లకు ఒక్కో దానికి సంవత్సరానికి రూ.100 కోట్లు చొప్పున ప్రతిపాదిస్తున్నాము. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 2016-17కు గాను రూ.300 కోట్లు ప్రతిపాదిస్తున్నాము. వీటితో పాటు రాష్ట్రంలోని ఇతర పట్టణాల్లోని మున్సిపాలిటీలకు 2016-17 బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

54. మిషన్ భగీరథ కోసం వేసే పైపులైన్ల ద్వారానే అన్ని నగరాలు, పట్టణాలకు మంచి నీరు ఇవ్వాలని నిర్ణయించాం. ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న 190 గ్రామాలకు కూడా మెట్రో వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలోనే మంచినీటి సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్ నగరానికి మంచినీరు సరఫరా చేయడం కోసం ప్రత్యేకంగా డ్రింకింగ్ వాటర్ రిజర్వాయర్ కట్టాలని నిర్ణయించాం. హైదరాబాదులో త్వరలోనే మెట్రో రైలు పరుగులు తీస్తుందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. మెట్రో

రైలు సౌకర్యం రావడం వల్ల కొంత మేర ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉంది. ఇంకా చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం స్ట్రాటెజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నది.

55. హైదరాబాద్ మెట్రో వార్షిక చెల్లింపుల కోసం రూ.200 కోట్లు, హైదరాబాద్ మహానగర మంచి నీటి సరఫరా బోర్డుకు రూ.1,000 కోట్లు ప్రతిపాదిస్తున్నాము. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ఆథారిటీకి సహాయంగా రూ.650 కోట్లను ప్రతిపాదిస్తున్నాము. 2016-17 బడ్జెట్‌లో మున్సినల్ అడ్మినిస్ట్రేషన్ మరియు పట్టణ అభివృద్ధి శాఖకు రూ.4,815 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

## పారిశ్రామికాభివృద్ధి

56. పోయిన సంవత్సరం బడ్జెట్ ప్రసంగంలో గౌరవ సభ్యులకు చెప్పినట్లే, పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక టి.ఎస్. ఐపాస్ విధానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. కొత్త పారిశ్రామిక విధానాన్ని అనుసరించి పరిశ్రమలు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని అనుమతులు ఏకగవాక్ష పద్ధతి (సింగల్ విండో)న ఇచ్చే వెసులుబాటును కల్పించినాము. దరఖాస్తు చేసిన నాటి నుండి నిర్దేశిత సమయంలో అనుమతులు పొందే సౌకర్యాన్ని పారిశ్రామిక వేత్తలకు కల్పించినాము. కొత్త పారిశ్రామిక విధానం సత్ఫలితాలను ఇస్తున్నది. అమెజాన్, మైక్రోమాక్స్, ఐటిసి వంటి బహుళ జాతి సంస్థలు, దేశీయ సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో తమ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాయి. కొత్త పారిశ్రామిక విధానం అమలులోకి వచ్చిననాటి నుండి ఇప్పటి వరకు 1609 యూనిట్లకు అనుమతులు ఇచ్చాము. ఈ పరిశ్రమల ద్వారా

రూ.33,101 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాక 1,20,169 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాము. అందులో కేవలం వంద భారీ, మధ్య తరహా యూనిట్ల వల్ల రూ.8491.66 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు 34,479 మందికి ఉపాధికి అవకాశం ఉన్నది. అందులో 32 యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించగా, మరో 8 యూనిట్లు సన్నాహక ఉత్పాదనలో ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో మెగాఫుడ్ పార్కు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తుది అనుమతులు ఇచ్చిందని సభకు తెలియజేసేందుకు సంతోషిస్తున్నాను. హైదరాబాద్ నగరంలో ఫార్మాసిటి, వరంగల్‌లో టెక్స్‌టైల్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నాం. మెదక్‌లో నిమ్జ్ (నేషనల్ ఇన్‌వెస్ట్‌మెంట్ మ్యానిఫ్యాక్చరింగ్ జోన్) ప్రారంభిస్తున్నాం. పరిశ్రమలకు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తున్నందువల్ల పారిశ్రామిక రంగం గణనీయంగా వృద్ధి చెందుతుందన్న నమ్మకం మాకున్నది. పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ రంగానికి 2016-17 బడ్జెట్‌లో రూ.967 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

## ఐటి మరియు కమ్యూనికేషన్స్

57. సమాచార సాంకేతిక విజ్ఞానానికి దేశంలో ప్రముఖంగా వినిపించేది తెలంగాణ రాష్ట్రం. మరీ ముఖ్యంగా చెప్పాలంటే హైదరాబాద్ నగరం. తెలంగాణాలో నమోదైన ఐ.టి యూనిట్లు 1300. రాష్ట్రంలో 2014-15లో జరిగిన ఐ.టి. ఎగుమతులు, ఐ.టి సేవల విలువ రూ. 68,258 కోట్లు. మైక్రో సాఫ్ట్, గూగుల్, ఐ.బి.ఎం., ఒరాకిల్ వంటి అనేక బహుళ జాతీయ సంస్థలు తెలంగాణలో తమ కార్యాలయాల్ని నడుపుతున్నాయి. దేశీయ ఐ.టి. దిగ్గజాలు అనదగిన ఇన్ఫోసిస్, విప్రో,

టి.సి.ఎస్, టెక్ మహేంద్ర వంటి కంపెనీలు ఎన్నో తెలంగాణలో ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో ప్రముఖ ఐ.టి. దిగ్గజం గూగుల్ సంస్థ వారు రూ.1000 కోట్ల పెట్టుబడితో తమ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. గూగుల్ సంస్థ అమెరికా బయట, అదీ హైదరాబాద్‌లో ఇంత పెద్ద ఎత్తున తమ కార్యకలాపాల్ని విస్తరించడం విశేషం. అమెజాన్ సంస్థ తమ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో తెరువనున్నది. పెట్టుబడులకు అనుకూల్ మైన విధానాల్ని రూపొందించడం వల్ల మనము ఈ ఫలితాలు చూడగల్గు తున్నాము. ఇదే స్ఫూర్తితో మరింత నిర్మాణాత్మకంగా ముందుకు పోవాల న్నది మా ఆలోచన.

58. టి-హబ్‌ను 2015 నవంబర్‌లో ప్రారంభించినం. ఇది వినూత్నం, విశిష్టం. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే సంస్థ ఇది. దేశంలో ప్రతిష్టాత్మకమైన మూడు సంస్థల సహకారంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దీనిని సాకారం చేసింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ టె క్నాలజీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నల్సార్‌లు ఇందులో ముఖ్య భూమిక నిర్వహిస్తున్నాయి. టెక్నాలజీ సంబంధించిన స్టార్టప్‌లను టి-హబ్ ప్రోత్సహిస్తుంది. మంచి ఆలోచనలతో కంపెనీని ఏర్పాటు చేయాలనుకునే ఔత్సాహికులకు ఇది ప్రేరణగా నిలుస్తుంది. వినూత్న ఆలోచన కలిగిన శక్తివంతమైన పారిశ్రామిక వేత్తలను ఒక్క చోట చేర్చేందుకు టి-హబ్ కృషి చేస్తుంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు విజేతలై నిలిచేందుకు తోడ్పాటునిస్తుంది. ఇది తొలి దశ మాత్రమే. టి-హబ్ రెండో దశను త్వరలో ప్రారంభిస్తాము.

59. ఐటి రంగంలో ప్రశంసాత్మకంగా చెప్పదగిన మరోముందడుగు డిజిటల్ తెలంగాణ కార్యక్రమం. పల్లెపల్లెలో ప్రతి పౌరుడికి డిజిటల్ సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో 2015 జూలై 1 ప్రారంభించినం. సామాన్యులను కూడా డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం విశిష్టత. ఐటి శాఖకు 2016-17 బడ్జెట్ లో రూ.254 కోట్లను ప్రతిపాదిస్తున్నాము.

## సంస్కృతి, పర్యాటక రంగం మరియు క్రీడలు

60. గతంలో తెలంగాణ సంస్కృతిని పట్టించుకోకపోయే వారు. మన రాష్ట్రం ఏర్పడిన వెంటనే తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు పూర్వ వైభవాన్ని తెచ్చే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహించినం. రాష్ట్రంలో మత సామరస్యాన్ని చాటుతూ గంగా జమునా తెహజీబ్ ను నిర్వహించినం. రంజాన్, క్రిస్టమస్‌లను రాష్ట్ర పండుగలుగా నిర్వహించినం. తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలయిన యాదగిరి, వేములవాడల అభివృద్ధి కోసం యాదగిరి గుట్ట అభివృద్ధి అథారిటీ, వేములవాడ అభివృద్ధి అథారిటీలని ఏర్పాటు చేసినం. మన రాష్ట్రం ఏర్పడ్డాక సాంస్కృతిక వారసత్వం, పర్యాటక ప్రదేశాలు, చారిత్రక ప్రదేశాల గురించిన అవగాహన ఆసక్తి ప్రజల్లో ఎక్కువైంది. దశల వారిగా ఆయా ప్రదేశాలను అభివృద్ధి చేసి, సౌకర్యాలను మెరుగు పరుస్తాము. చారిత్రక ఆలయాలను పునరుద్ధరించేందుకు తగినన్ని నిధులు కామన్ గుడ్ ఫండ్ లో లేనందున 2016-17 బడ్జెట్‌లో వన్ టైమ్ గ్రాంట్ గా రూ.50 కోట్లను ప్రతిపాదిస్తున్నాము.

61. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతుల మొత్తాన్ని 2016 జనవరి నుండి భారీగా పెంచినం. ఒలంపిక్స్, ఏసియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్, నేషనల్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడా కారులకు వరుసగా రూ.2 కోట్లు, రూ.30 లక్షలు, రూ.25 లక్షలు, రూ.5 లక్షలు ప్రోత్సాహకంగా ఇవ్వాలని నిర్ణయించినం. తెలంగాణలో క్రీడల అభివృద్ధికి పాటుపడుతున్న, టోర్నమెంట్లు నిర్వహిస్తున్న క్రీడాసంఘా లను గుర్తించేందుకు పారదర్శకంగా ఉండేవిధంగా మార్గదర్శకాలు రూపొందించినాము.

62. యువజన వ్యవహారాలు, పర్యాటక, సాంస్కృతికి శాఖకు 2016-17 లో రూ.232 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

## ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్.డి.ఎఫ్)

63. వార్షిక బడ్జెట్ తయారీ అనేది వివరణాత్మక ప్రక్రియ. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు అయ్యే వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని శ్రద్ధగా కేటాయింపులు చేయాల్సి వుంటుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికి కొన్ని శాఖల్లో ఆకస్మికంగా వచ్చే అవసరాలు, వాటికి అయ్యే వ్యయాలను మనం ముందు ఊహించలేము. కానీ, అవసరమైనప్పుడు తక్షణమే స్పందించి పరిష్కరించాల్సి వస్తుంది. మనకు ఉన్న వనరులకు వివిధ పద్దులకు ముందే కేటాయిస్తున్నం. కాబట్టి అనుకోని అవసరాలు వచ్చినప్పుడు తక్షణమే పరిస్థితిని అర్థం చేసుకుని చక్కదిద్దడానికి కొంచెం ఇబ్బంది అవుతుంది. కొంచెం సమయం కూడా పడుతుంది. ఆ నిధిని ఏ పద్దుకు కేటాయించక, కేవలం అనుకోని అవసరాలు వచ్చినప్పుడు

మాత్రమే వినియోగిస్తాము. 2016-17 బడ్జెట్‌లో ప్రత్యేక అభివృద్ధి నిధికి రూ.4,675 కోట్లు ప్రతిపాదిస్తున్నాము.

## 2014-15 అకౌంట్లు

64. 2014-15 సంవత్సరంలో 10 నెలల కాలానికి అకౌంటెంట్ జనరల్ గారు ధృవీకరించిన లెక్కల ప్రకారం రూ.368.66 కోట్లు రెవెన్యూ మిగులు తేలింది. ద్రవ్యలోటు రూ.9,410.48 కోట్లు, ఇది జి.ఎస్.డి.పి. లో 1.8 శాతం. ద్రవ్యలోటు ఎఫ్.ఆర్.బి.ఎమ్. నిర్దేశించిన పరిధిలోనే ఉన్నది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.62,306 కోట్లు ఖర్చు అయింది. అంచనాల ప్రకారం కేంద్ర ప్రభుత్వ బడ్జెటు నుంచి మన రాష్ట్రానికి అందాల్సిన నిధులు తగ్గడం, కొత్త రాష్ట్ర సమస్యలు, అధికారుల కేటాయింపులో జరిగిన జాప్యం వంటి కారణాల వల్ల బడ్జెట్ అంచనాలకు తగిన విధంగా వ్యయం చేయలేకపోయాము.

## సవరించిన అంచనాలు 2015-16

65. 2015-16 సంవత్సరపు సవరించిన అంచనాలను బట్టి రూ.1,00,062 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశాము. ఇది బడ్జెటు అంచనాలలో 86 శాతం. కేంద్రం నుండి రావాల్సిన ప్రణాళికా నిధులు తగ్గాయి. కోర్టు వ్యాజ్యాల కారణంగా భూముల అమ్మకం జరగలేదు. వాణిజ్య పన్నుల ద్వారా రావాల్సిన బకాయిలు కోర్టు కేసుల కారణంగా వసూలవలేదు. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వం చేతిలో లేని అంశాలు. 2015-16 సంవత్సరపు సవరించిన అంచనాల ప్రకారం రూ.60.54

కోట్ల రెవిన్యూ మిగులు ఉన్నది. రూ.16,912 కోట్ల ద్రవ్యలోటు ఉంటుందని అంచనా వేశాము.

## బడ్జెట్ అంచనాలు 2016-17

66. 2015-16 సవరించిన అంచనాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర సొంత ఆదాయం రూ.54,256.71 కోట్లు కాగా 2016-17లో రాష్ట్ర సొంత ఆదాయాన్ని రూ.72,412.23 కోట్లుగా అంచనా వేస్తున్నాము. కేంద్ర వితరణ కింద వచ్చే నిధులు, 2015-16 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.25,223.49 కోట్లు కాగా 2016-17 బడ్జెట్‌లో రూ.28,512.52 కోట్లను కేంద్రం ప్రతిపాదించింది. కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో నామ మాత్రపు పెరుగుదల కనిపిస్తున్నది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.1,30,415.87 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాము. దీనిలో ప్రణాళికేతర వ్యయం కింద రూ.62,785.14 కోట్లు, ప్రణాళికా వ్యయం కింద రూ.67,630.73 కోట్లు ప్రతిపాదిస్తున్నాము. ప్రణాళికేతర వ్యయం కంటే ప్రణాళికా వ్యయం ఎక్కువగా ఉండడం అపూర్వం. ప్రణాళికేతర వ్యయంలో ఎక్కువగా రాజీపడకుండా దీనిని చేసి చూపాము. వనరులను బలోపేతం చేసి, వ్యయాన్ని సహేతంగా క్రమబద్ధీకరించడం ద్వారా ఇది సాధ్యమయ్యింది. గత సంవత్సరం జి.ఎస్.డి.పి. ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2011-12 ను బేస్ ఇయర్‌గా స్వీకరించింది. కాబట్టి ఎఫ్.ఆర్.బి.ఎం చట్ట ప్రకారం 2016-17 సంవత్సరంలో ఋణ పరిమితి కొంత పెరగవచ్చని అంచనా వేస్తున్నాము.

67. 2016-17 సంవత్సరపు బడ్జెట్‌లో రెవిన్యూ మిగులు రూ.3,718.37 కోట్లు., ద్రవ్యలోటు రూ.23,467.29 కోట్లు

ఉండగలదని అంచనా వేస్తున్నాము. ఈ ద్రవ్యలోటు మన రాష్ట్ర స్థూల ఉత్పత్తి లో 3.5 శాతంగా అంచనా వేయటం జరిగింది. సాగునీటి రంగానికి కేటాయించిన నిధులను నిర్మాణ వ్యయంగా పరిగణించడం వల్ల రెవెన్యూ మిగులు అధికంగా అంచనా వేయబడింది.

68. గత సంవత్సర బడ్జెటు కేటాయింపులను, ఈ సంవత్సర బడ్జెటు ప్రతిపాదనలను శాఖల వారిగా పోల్చి చూడవద్దని గౌరవ సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను. వ్యయాన్ని సహేతుకంగా క్రమబద్దీకరించేందుకు వివిధ శాఖల్లో ఒకే రకమైన లక్ష్యాలు గల పథకాలను శాఖల వారీగా కొంత అధ్యయనం చేసి హేతుబద్ధం చేయడానికి ప్రయత్నం చేశాము, కొన్ని శాఖల్లో వేతనాల వ్యయం మాత్రమే ఉన్న పథకాలను ప్రణాళికా వ్యయం నుండి ప్రణాళికేతర వ్యయానికి మార్చాము. మిషన్ భగీరథ, రెండు బెడ్ రూమ్‌ల ఇండ్ల పథకాలకు ప్రణాళికా వ్యయం కింద కేటాయింపులను ప్రతిపాదించలేదు. ఈ రెండు పథకాలను బడ్జెటేతర వనరులతో నిర్వ హించనున్నాము. వీటిలో కూడా రాష్ట్ర భాగస్వామ్యంగా పరిమిత కేటా యింపులను ప్రతిపాదించినాము. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రంలో ప్రణాళికేతర వ్యయం కన్నా, ప్రణాళిక వ్యయం ఎక్కు వగా ఉండడం ఓ రికార్డు. దుబారాను బాగా తగ్గించుకుని ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఎక్కువ ఖర్చు చేయాలన్నది మా లక్ష్యం. సమైక్య ఆంధ్ర ప్రదేశ్ బడ్జెట్‌కు, తెలంగాణ బ డ్జెట్ కు తేడా గమనిస్తే ప్రభుత్వ ప్రాధా న్యాలు మరింత సులభంగా అర్థమవుతాయి.

69. సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి, అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సహృదయంగా ఆహ్వానిస్తున్నారన్నదే మాకు

సంతృప్తిని కలిగిస్తున్నది. సంక్షేమ పథకాలకు ప్రజల ఆమోదం లభించి నప్పుడు కలిగే తృప్తికి మించినది ఏమీ ఉండదు. ప్రజలే ప్రభువులుగా భావించే మా ప్రభుత్వానికి ప్రజల మన్ననలతో పాటు జాతీయ అంతర్జా తీయ స్థాయిలోను ప్రశంసలు అందుతున్నాయి. ఇండియా టు డే జర్నల్ వారు "State of the States Conclave" అనే ప్రత్యేక సంచికను విడు దల చేశారు. "ఇండియా టు డే" జర్నల్ వారు వివిధ రాష్ట్రాల పనితీరు పై అధ్యయనం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని వర్గాలను కలుపుకు పోయే రాష్ట్రం (Most Inclusive State) గా అభివర్ణించారు. మెర్సర్ అనే అంత ర్జాతీయ సంస్థ వారు "జీవన నాణ్యత" పై నిర్వహించిన అంతర్జాతీయ సర్వేలో భారత దేశంలో అత్యంత ఉత్తమ నగరంగా హైదరాబాదును నిర్ణ యించారు. హైదరాబాద్ నగరం ఆసియా ఖండంలో అత్యుత్తమ (M.I.C.E) మైస్ నగరంగా గుర్తించారు. అధ్యక్షా! ఈ  అవార్డులకు రివార్డు లకు మేము పొంగిపోము. వీటన్నిటి వల్ల, మాపై మరింత బాధ్యత పెరిగింది.  చేతనతో, దృఢ నిశ్చయంతో బంగారు తెలంగాణ సాధనకు కృషి చేయాల్సిన సంకల్ప బలాన్ని ఇవి పెంచుతున్నాయి.

70. ఆర్థిక శాస్త్ర పితామహుడు కౌటిల్యుడికి ఉన్న రాజనీతిజ్ఞత, భవిష్యత్తు అవసరాలపై నాటి అశోక చక్రవర్తికి ఉన్నంత దార్శనికత, ఇంటిని చక్కబెట్టుకొని సగటు ఇల్లాలికి ఉండే ఇగురం ఈ మూడింటి మేలైన కలయిక ఈ బడ్జెట్ ప్రతిపాదనలు. ఇంత కాలం నిర్లక్ష్యానికి గురయిన, తెలంగాణ ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు వినూత్న చర్యలు తీసుకుంటున్నాము. ఇంత తక్కువ సమయంలో ఇన్ని కొత్త పథకాలకు అంకురార్పణ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. 2014

జూన్ 1 వరకు తెలంగాణ ఒక బంధించిన పులి. ఇప్పుడు ఇది సంకెళ్ళు తెంచుకుని సొంత రాష్ట్రంగా అవతరించింది. దేశంలో కెల్లా అతివేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో మనం వున్నాం. అభివృద్ధికి వనరుల కంటే సుపరిపాలనే ఎక్కువ దోహద పడుతుందని ఎన్నో అధ్యయనాలు సూచిస్తున్నాయి. వనరులకు తోడు మనకున్న బలమైన నాయకత్వం, సుపరిపాలన, అంతులేని ప్రజాభిమానం, తెలంగాణ రాష్ట్రాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళ్తాయి. ఇంతటితో నా బడ్జెటు ప్రసంగాన్ని ముగిస్తూ, బడ్జెటును సభ ఆమోదానికై సమర్పిస్తున్నాను.

//జై తెలంగాణ  జైజై తెలంగాణ//